క్లుప్తంగా

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



వేంకటేశ్వరుని కల్యాణానికి తరలివచ్చిన భక్తులు

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయంలోని దేవతామూర్తుల విగ్రహాలను పల్లకీలో ఉంచి భక్తుల జనసందోహం మధ్య నిర్వాహకులు గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని వేదికపై ఆలయ ప్రధాన అర్చకుడు విజయ్‌కుమార్ నేతృత్వంలోని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని గ్రామానికి చెందిన సందీప్, అపూర్వ దంపతులు శాస్త్రోక్తంగా జరిపించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి వారి కల్యాణాన్ని భక్తి శ్రద్ధలతో తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన జరిగింది.

ఆలయానికి పోటెత్తిన భక్తులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. శనివారం ఏకాదశి తిథి కలసి రావడంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది. భారీ క్యూలైన్‌లో వెళ్లి భక్తులు స్వామిని దర్శించుకున్నారు. అలాగే ఆలయంలో నిత్యం నిర్వహిస్తున్న నారసింహ సుదర్శన హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నిత్యాన్నదాన పథకంలో సుమారు మూడు వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. అన్నదాన పథకంలో భక్తులకు భోజన సౌకర్యాలను, వడ్డిస్తున్న పదార్థాల గురించి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్ స్వయంగా పర్యవేక్షించారు.

లక్ష్మీనృసింహుని ఆదాయం రూ.3,27,363

అంతర్వేది లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఒక్కరోజు భక్తుల నుంచి వివిధ రూపాల్లో మొత్తం ఆదాయం రూ.3,27,363 సమకూరినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీ ఎన్‌వీ ప్రసాద్ తెలిపారు. ఇందులో స్వామివారి ప్రసాద విక్రయాలు, ప్రత్యేక దర్శనం టికెట్ల అమ్మకాలు, ఇతర సేవా టికెట్ల ద్వారా రూ.1,21,179, నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాల ద్వారా రూ.2,06,184 ఆదాయం వచ్చినట్టు ఆయన పేర్కొన్నారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు



మందపల్లిలో శనైశ్చరస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. దేవాదాయ–ధర్మదాయ డీసీ, ఈవో నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో స్వామివారి పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా ప్రాతఃకాల సమయంలో ఆలయ ప్రధాన అర్చకుడు అయిలూరి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. భక్తులు ప్రత్యక్షంగా, పరోక్షంగా తైలాభిషేకాలు, పూజలు ద్వారా దేవస్థానానికి రూ.1,90,975, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.51,625తో కలిపి మొత్తం రూ.2,42,600 ఆదాయం వచ్చినట్టు డీసీ అండ్ ఈఓ తెలిపారు.

పుష్కరాల పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

పి.గన్నవరం: రానున్న గోదావరి పుష్కరాలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు అవసరమైన రోడ్లు, పుష్కరఘాట్ల నిర్మాణం, ఇతర సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి అధ్యక్షతన శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పుష్కర ఘాట్లు ఉన్న ప్రాంతాల్లో ఏ పనులు చేపట్టాలో ప్రజా ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. రాజోలు డిపో నుంచి పి.గన్నవరం మీదుగా అమలాపురం, రాజమహేంద్రవరం వెళ్లే ఆర్టీసీ బస్సుల సమయాలు తెలియజేసే విధంగా స్థానిక మూడు రోడ్ల బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 18న విజయవాడలో నిర్వహించిన పాటల పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన పి.గన్నవరానికి చెందిన దొండపాటి నిత్య శ్రీధన్యను ఎమ్మెల్యే సత్కరించారు. ముంగండలో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని మాజీ ఎంపీపీ, ఎంపీటీసీ అంబటి భూలక్ష్మి అధికారులను కోరారు. ఎంపీడీఓ కేవీ ప్రసాద్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

జోరుగా నారుమడులు

- విత్తనాల లభ్యత అంతంత మాత్రమే
- ఖరీఫ్‌లోనూ రైతుకు అందని పంటసాయం



సూర్యారావుపేటలో ఖరీఫ్ నారుమడిని సిద్ధం చేస్తున్న రైతు



చింతలూరులో పవర్ టిల్లర్‌తో దమ్ము

ఆలమూరు: ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు ముందే పలకరించడంతో నారుమడుల ప్రక్రియ చురుగ్గా జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా అన్నదాతా సుఖీభవ (పంటసాయం) అందకపోవడంతో అప్పులు తెచ్చి అన్నదాతలు సాగును ప్రారంభించారు. వ్యవసాయ శాఖ పూర్తి స్థాయిలో విత్తనాలు సరఫరా చేయపోవడంతో రైతులు తాము సమకూర్చుకున్న విత్తనాలనే ఖరీఫ్ సీజన్‌కు వినియోగిస్తున్నారు. క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 58 వేల ఎకరాల్లో వరిసాగు చేపట్టారు. ఇప్పటికే సుమారు పది వేల ఎకరాలకు సంబంధించి నారుమళ్ల ప్రక్రియ పూర్తయింది. మిగతా భూమికి సంబంధించి నారుమడులు వేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే తూర్పు డెల్టా ప్రధాన కాలువకు సాగునీరు విడుదల చేయడంతో ఈ సీజన్‌లో 60 శాతం మేర వెదజల్లు సాగు చేపడుతుండగా మిగతా భూమిలోని నారుమళ్ల ద్వారా సాగు చేస్తున్నారు.

క్లస్టర్ పరిధిలో 73 రైతు సేవా కేంద్రాలున్నా రైతులకు సహాయ సహకారాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. గతంలో రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాలు పనిచేయకపోవడంతో రైతులకు వ్యవసాయ సూచనలు, సలహాలు అందకుండా పోయిందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

స్వర్ణ (7023) రకానికే రైతులు అనుకూలం

అధిక దిగుబడి సాధించడంతో పాటు తెగుళ్లను తట్టుకుని త్వరితగతిన పంట చేతికి వచ్చే అధునాతనమైన ఎంటీయూ (1318), ఎంటీయూ (1121) విత్తనాలను సాగు చేయాలని వ్యవసాయశాఖ సూచిస్తున్నా రైతులు మాత్రం స్వర్ణ (7023) సాగుకే మొగ్గు చూపుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో అధిక సంఖ్యలో రాయితీపై పవర్ టిల్లర్లు సరఫరా చేయడంతో ప్రస్తుతం నారుమళ్ల ప్రక్రియ వేగంగా సాగుతుంది.

నాట్లు త్వరగా పూర్తి చేయాలి



ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి త్వరితగతిన వరినాట్లు ప్రక్రియను పూర్తి చేసి జూలై మూడో వారం నాటికి వరినాట్లు ప్రక్రియను పూర్తి చేస్తే మూడో పంటకు అవకాశం ఉంటుంది. దీనివల్ల అక్టోబర్ నెలాఖరు నాటికి వరి కోతలు పూర్తయ్యే అవకాశం ఉంటుంది. ఏటా నవంబర్ నెలలో సంభవించే ప్రకృతి వైపరీత్యాలను నుంచి తప్పించుకోవచ్చు. మళ్లీ డిసెంబర్ చివరి నాటికి రబీ సాగుకు సంబంధించి వరినాట్లు పూర్తి చేస్తే వచ్చే ఏడాది మార్చి నాటికి రబీ సాగు చేతికొస్తుంది. దీనివల్ల మూడో పంటగా అపరాల సాగు చేసుకునే అవకాశం ఏర్పడుతుంది.

– ఎస్.లక్ష్మీలావణ్య, ఏవో, ఆలమూరు

విఘ్నేశ్వరుని సన్నిధిలో అడిషనల్ ఎస్పీ పూజలు



అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో అడిషనల్ ఎస్పీ దంపతులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని జిల్లా అడిషనల్ ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్ కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు వీరికి ఆలయ ప్రధాన అర్చకులు మాచరి వినాయకరావు, ఆలయ వేదపండితులు వేదమంత్రాలతో స్వాగతం పలికారు. ప్రసాద్‌కు వేద ఆశీర్వచనం అందజేసి స్వామి చిత్రపటం ప్రసాదం అందజేశారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా చినబాబు

అంబాజీపేట: అంబాజీపేట ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బి.చినబాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూ విభాగానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని ఆయన తెలిపారు. అమలాపురం కలెక్టరేట్లో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. 2019 నుంచి 2022 వరకు మామిడికుదురు మండలంలో, 2022 నుంచి ఐ.పోలవరం మండలంలో విధులు నిర్వహించానని చెప్పారు. అమలాపురం కలెక్టరేట్లో డిప్యూటీ తహసీల్దార్ హోదాలో విధులు నిర్వహించానన్నారు. ఆయా కార్యాలయాల్లో పని చేసిన అనుభవంతో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు.

సంపద తయారీ కేంద్రాల ప్రారంభం

అయినవిల్లి: గృహ వ్యర్థాల నుంచి సంపదను సృష్టించి సంపూర్ణ పారిశుధ్యాన్ని సాధించడమే లక్ష్యంగా తద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయ మార్గంగా తీర్చిదిద్దడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. శనివారం వెలువలపల్లిలో ఉపాధి హామీ పథకం ద్వారా సుమారు రూ.22 లక్షలతో నిర్మించిన భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే మండలంలోని మాగం, పొట్టిలంక గ్రామాల్లో నిర్మించిన చెత్తతో సంపద తయారీ కేంద్రాల నూతన భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకట సరోవరరావు, సర్పంచ్ బొంతు మణి, నాయకులు బడుగు జోగేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడికి సాయం



సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.14,500 ఆర్థిక సాయం శనివారం అందజేశారు. ఆత్రేయపురం మండలం మెర్లపాలెం గ్రామానికి చెందిన రంకిరెడ్డి దుర్గాప్రసాద్ (19) వారం రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయమైంది. రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. తలకి ఆపరేషన్ జరిగింది. ఇంకా కొన్ని రోజులు ఆస్పత్రిలో ఉండాల్సిన పరిస్థితి. ఆర్థికస్తోమత లేక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. రావులపాలెంలో దుర్గాప్రసాద్ తండ్రి రంకిరెడ్డి సత్యనారాయణకి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.14,500 చెక్కు అందజేశారు.

ఎన్నారై ఫౌండేషన్ సేవలు మరువలేనివి



లక్కవరంలో ఆర్థిక సాయం అందిస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి

మలికిపురం: గల్ఫ్ గృహ కార్మికుల హెల్పింగ్ హ్యాండ్స్ ఎన్నారై ఫౌండేషన్ కువైట్ గ్రూప్ అందిస్తున్న సేవలు అభినందనీయమని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మలికిపురం మండలం, లక్కవరంలో ముస్కూడి పెద్దిరాజు కాలు, చేయి లాగి బాధపడుతున్నారు. ఇంటికి పెద్ద దిక్కు అయిన పెద్దిరాజుకు ఇలా జరగడంతో కుటుంబం ఆందోళనలో ఉన్నారు. పరిస్థితిని గమనించిన బాబు జగ్జీవన్ రావు సంక్షేమ సంఘ పెద్దలు ముస్కూడి భాస్కరరావు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తెన్నేటి ఫిలిప్‌కి తెలియజేయగా వైద్యం నిమిత్తం రూ.10 వేలు, మాజీ మంత్రి వర్యులు గొల్లపల్లి సూర్యారావు చేతుల మీదుగా అందించారు. మోరి గ్రామానికి చెందిన రాచపల్లి దుర్గాప్రసాద్‌కి రూ.10 వేలు, బూసి రాజకుమార్‌కు రూ.11 వేలు, యాండ్ర శ్రీనుకు రూ.11 వేలు అందించారు. కార్యక్రమంలో సూర్యారావు మాట్లాడుతూ లబ్ధిదారులు సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తాడి సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

పలువురికి కో ఆర్డినేటర్ పరామర్శ



బెల్లంపూడిలో లక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు

పి.గన్నవరం: మాతృ వియోగంతో బాధపడుతున్న బెల్లంపూడికి చెందిన ఓ న్యూస్ చానల్ రిపోర్టర్ గూటం శ్రీనును వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గం కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు శనివారం పరామర్శించారు. శ్రీను తల్లి లక్ష్మి ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో శ్రీనును పరామర్శించి అతని తల్లి లక్ష్మి చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ నేతలు యన్నాబత్తుల ఆనంద్, దొమ్మేటి వెంకటశివరామన్, అడ్డగళ్ల సాయిరామ్, దొమ్మేటి దుర్గారావు, బండి రమేష్, చింతా నాగేశ్వరరావు, రొక్కాల శాంతారావు, తదితరులు ఉన్నారు.

రాధ కుటుంబానికి..

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సంసాని రాధ కుటుంబ సభ్యులను నియోజకవర్గ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావుతో పాటు పార్టీ నాయకులు శనివారం పరామర్శించారు. ఆయన కుమారుడు మురళికి మనోధైర్యం కల్పించారు. రాధ చిత్ర పటం వద్ద నివాళులర్పించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, రాయుడు మీరయ్య, ఎం.ఎం.శెట్టి, రాయుడు షన్ముక్, సూదాబత్తుల రాము, రాయుడు కృష్ణమహేష్, దొమ్మేటి రాంబాబు, సంసాని రామకృష్ణ తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు.

పారిశుధ్య కల్పనకు స్వచ్ఛ ఆంధ్ర



ఆలమూరులో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా మొక్క నాటుతున్న ఎంపీడీఓ రాజు తదితరులు

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్రతో పల్లెలను పరిశుభ్ర వాతావరణంలో ఉంచుతుందని రామచంద్రపురం ఇన్‌చార్జి డీఎల్‌పీఓ, ఎంపీడీఓ ఎ.రాజు, తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు అన్నారు. అలాగే ఆయా గ్రామాల్లోని గ్రామ సచివాలయాల వద్ద ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామ సచివాలయ ఉద్యోగులందరూ సంయుక్తంగా భారీ ర్యాలీలు, మానవహారాలు నిర్వహించిన మొక్కలు నాటి స్వచ్ఛ ఆంధ్ర ఆవశ్యకతను వివరించారు. ఎంపీడీఓ రాజు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. గ్రామాలన్నీ స్వచ్ఛంగా మారినప్పుడే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం స్వచ్ఛ ఆంధ్రగా మారుతుందన్నారు. సర్పంచ్ నేలపూడి లావణ్య, గృహనిర్మాణ శాఖ ఏఈ దరణాల శ్రీనివాసు, ఏపీఎం ఎం.ధనరాజు, ఏపీఓ జి.అరుణకుమారి, ఎంఏఓ ఎంఎం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. స్వామివారి దర్శనం కోసం తెల్లవారుజాము నుంచి భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. వేంకటేశ్వరస్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయం వద్ద భక్తులకు భారీ అన్నదానం చేశారు. అలాగే అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తులు సందడి చేశారు. స్వామికి వివిధ పూజల ద్వారా రూ.2,42,102 ఆదాయం లభించింది. స్వామివారి అన్నదాన ప్రసాదాన్ని 2900 మంది భక్తులు స్వీకరించారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో 'మిత్రమండలి మూవీ' టీమ్



విఘ్నేశ్వరుని సన్నిధిలో మిత్ర మండలి మూవీ టీమ్

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామిని 'మిత్రమండలి మూవీ టీమ్' శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకుడు మాచరి వినాయకరావు వేదాశీర్వచనం అందజేసి శేష వస్త్రాలు అందజేశారు. స్వామివారి చరిత్రను వీరికి వివరించారు. ఆలయ ఈవో అల్లు వెంకట దుర్గాభవాని వీరికి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

యోగాంధ్రకు బస్సులు.. ప్రయాణికులకు ఇక్కట్లు



రావులపాలెంలో బస్సులు రాక కూర్చొన్న చోటే నిద్రపోతున్న ప్రయాణికులు

రావులపాలెం: యోగాంధ్ర కార్యక్రమానికి ఆర్టీసీ బస్సులు వైజాగ్ తరలించడంతో రావులపాలెం డిపో పరిధిలో బస్సులు లేక ప్రయాణికులు శనివారం నానా అగచాట్లు పడ్డారు. కోనసీమ తిరుపతి వాడపల్లి వేంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు బస్సులు లేక గంటల తరబడి బస్టాండ్లో వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. కొంతమంది బస్సులు రాక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి గమ్యస్థానాలను చేరుకున్నారు. ప్రతిరోజు రావులపాలెం ఆర్టీసీ డిపోకు రూ.9 లక్షల ఆదాయం వచ్చేది. అయితే వాడపల్లి భక్తుల రద్దీతో ప్రతి శనివారం రూ.13 లక్షల ఆదాయం వస్తుంది. అయితే యోగాంధ్రకు బస్సులు పంపడంతో బస్సులు లేక శనివారం అదనంగా వచ్చే నాలుగు లక్షల ఆదాయం రెండు లక్షలకు తగ్గిపోయింది. ఈ శనివారం సాయంత్రానికి రూ.2 లక్షల వరకూ మాత్రమే ఆదాయం వచ్చినట్టు అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్టాండ్లో బల్లలు సరిపోక ప్లాట్‌ఫారాల మీద, బస్సులు ఆగే ప్రాంతాల్లో మెట్ల మీద, కూర్చోవడంతో పాటు గంటల తరబడి బస్సుల కోసం పడిగాపులు పడ్డారు.



రాజోలు బస్టాండ్ వద్ద బస్సుల కోసం పడిగాపులు పడుతున్న ప్రయాణికులు

రాజోలు: విశాఖలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమానికి రాజోలు ఆర్టీసీ డిపో నుంచి బస్సులను తరలించడంతో శనివారం బస్టాండ్ వద్ద ప్రయాణికులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. బస్సులు నిర్ణీత సమయానికి లేకపోవడంతో గంటలు తరబడి ప్రయాణికులు వేచియున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు, మహిళలు బస్టాండ్ వద్ద ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాజోలు నుంచి పాలకొల్లు, భీమవరం, రాజమహేంద్రవరం వెళ్లేందుకు బస్సులు లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది. యోగాంధ్ర వంటి కార్యక్రమాలు ఉన్న సమయంలో ముందస్తుగానే కొన్ని రూట్ల బస్సు సర్వీసులను రద్దు చేస్తున్నట్టు సమాచారం ఇవ్వాలని ప్రయాణికులు మండిపడ్డారు.

సకల రోగ నివారిణి

- గ్రామగ్రామానా యోగా దినోత్సవం
- పాల్గొన్న విద్యార్థులు, నాయకులు



మలికిపురంలో విద్యార్థులతో కలసి యోగా చేస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్



పి.గన్నవరంలో జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద యోగాసనాలు వేస్తున్న విద్యార్థిని



దేవరపల్లిలో యోగా ఆంగ్ల అక్షరాల క్రమంలో విద్యార్థులు

అంబాజీపేట/పి.గన్నవరం/మామిడికుదురు: సకల రోగ నివారిణిగా మానసిక ఒత్తిడిని జయించేందుకు యోగ నిత్య ఔషధమని నేటి రోజుల్లో ప్రతి ఒక్కరూ యోగా బాట పట్టాల్సిందేనని పి.గన్నవరం నియోజకవర్గ ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ వై.భీమారావు, తహసీల్దార్ బి.చినబాబు అన్నారు. అంబాజీపేటలో ఎంపీడీఓ కార్యాలయం, జెడ్పీ హైస్కూల్ వద్ద యోగాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, ప్రతి ఒక్కరూ యోగా చేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం కె.ఉమాదేవి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సుమారు 500 మంది విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ఎమ్మెల్యే కూడా యోగా చేశారు. మామిడికుదురు బోయి భీమన్న గెయిల్ శిక్షణ కేంద్రం, పాశర్లపూడిబాడవ కొబ్బరి పీచు శిక్షణ కేంద్రం, నగరం, పాశర్లపూడి, పాశర్లపూడిలంక, అప్పనపల్లి, పెదపట్నంలంక, లూటుకుర్రు, మగటపల్లి, మొగలికుదురు, పెదపట్నం, ఆదుర్రు, బి.దొడ్డవరం తదితర గ్రామాల్లో గ్రామ పంచాయతీలు, జెడ్పీహెచ్, మండల పరిషత్ స్కూల్స్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఉపాధి హామీ పథకం శ్రామికులు, పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కూటమి నేతలు యోగాలో పాల్గొని ఆసనాలు వేశారు.

మలికిపురం/సఖినేటిపల్లి/రాజోలు: యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మలికిపురం డిగ్రీ కళాశాల ఇండోర్ స్టేడియంలో శనివారం యోగా దినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే దేవ పాల్గొని మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అనే సందేశాన్ని ప్రసారం చేస్తూ, విద్యార్థులలో యోగాపై ఆసక్తిని పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించబడిందన్నారు. విద్యార్థులు, స్థానిక నాయకులతో కలసి యోగా అభ్యసనం చేశారు. అంతర్వేదికర జెడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల టీచర్, ప్రముఖ యోగా గురువు మన్నె సత్యనారాయణ అన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులతో ఆయన యోగాసనాలు వేయించారు. యోగా గురువు చిట్టూరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శివకోటి గురుకుల పాఠశాల విద్యార్థినులతో కలసి ఎమ్మెల్యే యోగాసనాలు వేశారు.

కొత్తపేట/ఆలమూరు/రావులపాలెం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ ఉద్యానవనంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు. స్థానిక కోర్టుల ప్రాంగణంలో సీనియర్ సివిల్ జడ్జి ఐ.సాయికుమారి, మండలంలోని బిళ్లకుర్రు సర్పంచ్ నెల్లి లక్ష్మీపతిరావు ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక కమ్మిరెడ్డిపాలెం గౌతమి స్కూల్ ప్రాంగణంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో, వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగా దినోత్సవాన్ని చేశారు. వాడపాలెంలో సర్పంచ్ త్సామా బాబు ఆధ్వర్యంలో యోగా గురువు ఆకుల శ్రీనివాస్ పర్యవేక్షణలో యోగాసనాలు చేయించి, వాటి వలన ఉపయోగాలు, సంపూర్ణ ఆరోగ్యం వంటి అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆలమూరులోని వివిధ గ్రామాల్లో యోగా దినోత్సవం శనివారం ఘనంగా జరిగింది. మండలంలోని ఆయా గ్రామ సచివాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, స్వచ్ఛంద సంస్థ కార్యాలయాల్లో యోగా దినోత్సవాన్ని ప్రజలదరూ ఆనందోత్సాహాల మధ్య క్రమశిక్షణతో జరుపుకున్నారు. రావులపాలెం మండలంలో పలు ప్రాంతాల్లో యోగాను ఘనంగా నిర్వహించారు. మండల వ్యాప్తంగా 207 కేంద్రాల్లో యోగా దినోత్సవాన్ని నిర్వహించగా, అధికారులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొని యోగాసనాలు వేశారు. పాఠశాలలు, వివిధ యోగా కేంద్రాల వద్ద, ఈతకోట టోల్ ప్లాజా వద్ద, రావులపాలెం పార్కు వద్ద గ్రామపంచాయతీ, సీఆర్‌సీ యోగా మిత్ర మండలి ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా గురువులు పలువురు యోగా విశిష్టతను వివరించారు. ఆయా కేంద్రాల్లో యోగాసనాలు వేసి అవగాహన కల్పించారు. అలాగే దేవరపల్లి బాలయోగి పేట హైస్కూల్లో విద్యార్థులు యోగా ఆంగ్ల అక్షరాల రూపంలో కూర్చుని ఆకట్టుకున్నారు.